క్లుప్తంగా

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కొలాం ఆదివాసీ గిరిజనులు

ఇంద్రవెల్లి: అన్నిరంగాల్లో వెనుకబడిన కొలాం ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్(పీఎం–జేఏఎంఎన్) పథకాన్ని కేంద్రం ప్రవేశ పెట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కొలాం ఆదివాసీ గిరిజన పెద్దలు మంగళవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుల రి ్పంచారు. మర్కగూడ సర్పంచ్ కొడప భీంరావ్, కొలాం ఆదివాసీ పెద్దలు కొడప లక్ష్మణ్, కుమ్ర నాగోరావ్, కుమ్ర భీంరావ్, టెకం తుల్సిరాం, లేతు, తుకారం, రాజు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

జంగు లింగు దీక్షలు స్వీకరించాలి



హోమం నిర్వహిస్తున్న ఆదివాసీ యువకులు

ఇచ్చోడ: ఆదివాసీ యువకులు జంగు, లింగు దీక్షలు స్వీకరించడానికి ముందుకు రావాలని జంగోలింగో పీఠాధిపతి కుమ్ర భగవంత్‌రావు పేర్కొన్నారు. మండలంలోని గేర్జంలో సోమవారం హోమం నిర్వహించి జైజంగు జై లింగు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర పుష్యమాసంలో దీక్షలు స్వీకరించడం ద్వారా ఆదివాసీల ఆరాధ్యదైవమైన జంగుబాయి ఆశీర్వచనాలు వారి కుటుంబాలపై ఉంటాయన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి నగేశ్, జిల్లా అధ్యక్షుడు బాపూరావు, ఆదివాసీ సేన జిల్లా నాయకుడు కోటేశ్వర్, సర్పంచ్ విజయ ప్రకాశ్, గ్రామపటేల్ లచ్చు తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయసాధనకు కృషి



పూలమాల వేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎదులాపురం: పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి ఆశయసాధనకు కృషిచేస్తామని జిల్లా నాయకుడు మడావి గణేశ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల సాధన కోసం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ స్థాపించారని తెలిపారు. ఇదిలా ఉండగా, గుంటూరు కారం చిత్రంలో విలన్ పాత్రలకు కారల్ మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం సరికాదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు హరీశ్, నగేశ్, శ్రీకర్, ప్రథమేష్, శివాజీ, నిఖిల్, దీపలక్ష్మి, యశోద, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న కుమ్ర ఈశ్వరిబాయి

నార్నూర్: మండలంలోని ముక్తాపూర్ కొలాం గూడ గిరిజనులకు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలి నుంచి రక్షణ పొందేందుకు 30 కొలాం గిరిజన కుటుంబాలకు దుప్పట్లు అందించినట్లు ఆమె తెలిపారు. అనంతరం వారితో సమావేశమై గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. కొలాం గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. రాంజీగొండు ఆశయసాధన సమితి చైర్మన్ మర్సుకోల తిరుపతి, గ్రామపటేళ్లు సిడాం లక్ష్మణ్, ఆత్రం నాగోరావు, రాంశావ్, సోనేరావు, ఆత్రం నాగుబాయి ఉన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

ఇచ్చోడ: ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఇచ్చోడ, మన్నూర్ సీసీఐ కేంద్రాల్లో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. పత్తిని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు



నేరడిగొండ: గంగిరెద్దు విన్యాసాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచి ఆడపడుచులు ఇళ్ల ముందు రంగు రంగులతో అందమైన ముగ్గులు వేశారు. కాగా, మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసం వద్ద గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగిరెద్దుకు పూజలు నిర్వహించారు. కాగా, సోమవారం సంక్రాంతి వేడుకలు జరుపుకోగా, మంగళవారం కనుమ జరిపారు. ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సద్దాం, సాబ్లే ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. తాంసిలోని రామలింగేశ్వర ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువతులు, చిన్నారులు పాల్గొని ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలు పరిశీలించి సందేశాత్మకం, పండుగ ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ఉన్న రంగవల్లులను ఎంపిక చేశారు. రామగిరి మనీషా(ప్రథమ), చిల్కూరి వర్షణికి (ద్వితీయ) బహుమతులను సర్పంచ్ స్వప్న, గ్రామాభివృద్ధి కమిటీలు అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిన్న రాంరెడ్డి, గ్రామపెద్దలు మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రజనీకాంత్, పరమేశ్ తదితరులు ఉన్నారు.

తాంసిలో ఉట్టికొట్టే కార్యక్రమం..

తాంసి పంచాయితీ కార్యాలయ ఆవరణలో జ్ఞానోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టి ఉట్టి పగులకొట్టిన వారికి రూ.2వేల నగదు బహుమతి ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. పలువురు యువకులు, పెద్దలు 100 మంది పాల్గొన్నారు. గణేశ్.. ఉట్టికొట్టగా ఆయనకు నిర్వాహకులు, గ్రామపెద్దల రూ.2వేల నగదు అందించారు. గ్రామపెద్దలు కృష్ణ, యువజన సంఘం సభ్యులు రాఘవేంద్ర, సంతోష్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



తాంసి: బహుమతులు అందుకున్న మహిళలు, చిన్నారులు



తాంసిలో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

ఇచ్చోడ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యానగర్‌లో సంక్రాంతి సందర్భంగా సోమవారం యువసేనయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చౌహాన్‌సునీత, ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, గోల్డెన్ లీఫ్ కరస్పాండెంట్ రాథోడ్ అనిల్, మౌనిక, నిమ్మల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు’



కండువా కప్పుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో మరిన్ని హామీలు ఇచ్చినా ఎంపీ స్థానాలను గెలుచుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదవులు అనుభవించిన నేతలు, కాంగ్రెస్‌లో చేరిన వారు పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఇటీవల ఇన్‌చార్జి మంత్రి సీతక్క నిర్మల్ పర్యటన సమయంలో పలు గ్రామాల సమస్యలు విన్నవించడానికి వెళ్లిన సర్పంచులకు కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తెలిపారు. నాయకులు గోవర్ధన్, రమేశ్, మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, సోనేరావు, సంతోష్, కుమ్ర రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోగు రామన్నను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఆయన నివాసంలో కలిసి సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ విషయాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. ఆయన వెంట ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి తదితరులు ఉన్నారు.

గణతంత్ర వేడుక సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నాయకులు

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లిలోని అంబేద్కర్ భవనంలో ఈనెల 26న నిర్వహించే గణతంత్ర వేడుక సభను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. మంగళవారం ఉట్నూర్‌లో సభపోస్టర్‌ను దళిత సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ సభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి బహుజన సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు తరలిరావాలని కోరారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మరే, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, దళిత సంఘాల నాయకులు దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, కొండిబా, సత్యానంద్, జితేందర్, ఎండీ మసుద్, సునీల్, భాస్కర్, ఆచారే దత్తా, సాగర్ పాల్గొన్నారు.

‘పది మందికి సేవ చేయడమే తన లక్ష్యం’



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న సినీనిర్మాత అభినవ్ సర్దార్

ఆదిలాబాద్‌రూరల్: ఉన్నత చదువులు చదివినా తాను పది మందికి సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని సినీనటుడు, నిర్మాత అభినవ్ సర్దార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన సమావేశంలో మాట్లాడారు. అన్ని వనరులున్నా ఆదిలాబాద్ జిల్లాలో ఇండస్ట్రీస్ వంటివి నెలకొల్పిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలతోపాటు విద్యాపరంగా సేవలందిస్తానన్నారు. సమావేశంలో నాయకులు చౌహాన్ సాయిరాం, రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ జైవంత్‌రావ్, రాథోడ్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

దీక్ష భూమి సందర్శన

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమిని అభినవ్ సర్దార్ మంగళవారం సందర్శించారు. దీక్షాగురువు సంత్ ప్రేంసింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం భీంపూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దినేశ్ రాథోడ్, ప్రవీణ్‌నాయక్ ఉన్నారు.

ఇచ్చోడ: గోవులను సంరక్షించాలని అభినవ్ సర్దార్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని జైశ్రీరాం గోశాలను సందర్శించి గోవులకు దాణా తినిపించారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకుడు ఐద రాజేశ్‌ను అభినందించారు. కామగిరి సర్పంచ్ భీంరావు, స్థానికులు ఉన్నారు.

కోగ్దూర్‌ను అభివృద్ధి చేస్తా

• ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



గుర్రంపై స్వాగతోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: కష్టకాలంలో అండగా నిలిచిన కోగ్దూర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని కోగ్దూర్ గ్రామంలో మంగళవారం మొదటిసారి వచ్చిన ఆయన్ను స్థానికులందరు ఐక్యతతో గుర్రంపై ఎక్కించి, స్వాగతోత్సవ ర్యాలీ నిర్వహించారు. పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులకు రుణపడి ఉంటానని, వారికి అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాక్రే మురళీధర్, నియోజకవర్గ కన్వీనర్ బోయర్ విజయ్, గుడిహత్నూర్ జెడ్పీటీసీ బ్రహ్మానందం, సర్పంచ్ రాకేశ్, నాయకులు రామెల్లి మోరేశ్వర్, బోనిగిరివార్ గణేశ్, కాడే సంజయ్, తాక్రే సందీప్, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గు



ఇచ్చోడ: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీలో ఓ గృహిణి తన వాకిట్లో వేసిన ముగ్గు ఆకట్టుకుంది. మహిళ వేషధారణలో ముగ్గు ద్వారా ఆహ్వానించడాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.

ఆలయంలో పూజలు

జైనథ్: మండలంలోని అతిప్రాచీన శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని ఆర్ఎస్ఎస్ వనవాసీ కళ్యాణ్ చీఫ్ సోమయాజులు దర్శించుకున్నారు. ముంబై నుంచి విచ్చేసిన ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆలయఈవో వామన్‌రావ్, అర్చకులు వెంకటరమణాచార్యులు ఉన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

జైనథ్: మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

‘మహేశ్‌బాబు, త్రివిక్రమ్ క్షమాపణ చెప్పాలి’

ఎదులాపురం: గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు శ్రామికవర్గ నేతలు కారల్‌మార్క్స్, లెనిన్ పేర్లను పెట్టిన డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేశ్‌బాబు వెంటనే క్షమాపణ చెప్పాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. సినిమా యూనిట్ బహిరంగ క్షమాపణ తెలపాలని, సినిమా నుంచి ఆ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు హరీశ్, భీమ్‌రావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ కోసం నగదు విరాళం



నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, సర్పంచ్ పోతరెడ్డి

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో నిరుద్యోగ యువత కోసం గ్రంథాలయ, స్టడీ మెటీరియల్ కోసం జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, గ్రామస్తులు లోక ప్రవీణ్‌రెడ్డి, దివాకర్, లింగారెడ్డి తదితరులు రూ.40 వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. గ్రామస్తులు, దాతల అందించిన విరాళాన్ని వారికి అందించారు. జెడ్పీ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ పోతరెడ్డి, అంబేద్కర్ సంఘం యువజన సంఘ అధ్యక్షుడు చైతన్య, సొసైటీ సీఈవో మోతే శ్రీనివాస్, గంగాధర్, గంగన్న, వెంకటేశ్, సాంబశివ్, మల్లేశ్‌యాదవ్, ధనుంజయ్, సతీశ్‌రెడ్డి, భూమన్న పాల్గొన్నారు.

సాంస్కృతిక కళలకు పూర్వవైభవం



జడకొప్పులాటను ప్రారంభిస్తున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: అంతరించిపోతున్న సాంస్కృతిక కళలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు మంథనం ఒక సంకల్పం నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రామచంద్ర గోపాలకృష్ణ మఠం ఆవరణలో సోమవారం నిర్వహించిన జడకొప్పులాట కళా ప్రదర్శనను ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన ఆమె సంస్థ నిర్వాహకులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జడకొప్పులాట కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం కళాకారులను అభినందించారు.

భీంపూర్‌కు చేరిన పాదయాత్ర



అంతర్గాంలో భక్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాంసి: లోక కల్యాణార్థం కోసం అడానేశ్వర్ భక్తులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం భీంపూర్‌కు చేరింది. జైనథ్ మండలం నిరాల గ్రామానికి చెందిన వీరు ప్రతిఏటా అమరావతికి అడానేశ్వర్ సంస్థానానికి పాదయాత్ర చేస్తారు. దీనిలో భాగంగా మండలంలోని భీంపూర్, వడూర్, అర్లి మీదుగా అంతర్గాం గ్రామానికి ఈ యాత్ర చేరుకుంది. గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో వారికి స్వాగతం పలికారు. ర్యాలీ నిర్వహించి గ్రామస్తులతో కలిసి పాదయాత్ర కొనసాగించారు. ఈనెల 25న అమరావతిలోని అడానేశ్వర్ సంస్థాన్‌కు చేరుకుని ప్రత్యేక పూజలు అనంతరం తిరుగుపయనం కానున్నారు. భక్తులు శ్రీనివాస్, సూరజ్, ఆకాశ్, రాజు ఉన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



బోథ్: అక్షింతలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోథ్: అయోధ్య శ్రీరాముని అక్షింతలను సునల గ్రామంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు జీవీ రమణ, ప్రధాన కార్యదర్శి రామగిరి శ్రీనివాస్, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో ఆదిలాబాద్ సివిల్ సొసైటీ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆడే గజేందర్

బోథ్: మండల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ నాయకుడు ఆడే గజేందర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో సోమవారం పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అందరం కలిసికట్టుగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేద్దామన్నారు. నియోజకవర్గ సమస్యలను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్, పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్‌లో భారీ చేరికలు ఉంటాయని పేర్కొన్నారు.

‘బీఆర్‌ఎస్ పనైపోయినట్లే’

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలతో బీఆర్‌ఎస్ పనైపోయిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ ఇచ్చే స్థాయిలో లేదని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని సంజయ్‌నగర్‌కాలనీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు యువకులు ఆయన సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతే నేను అమెరికా వెళ్లిపోతానని ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేశారన్నారు. ఓడినా తాను ప్రజల మనిషినని, నియోజకవర్గ ప్రజల కోసం ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. ఇకపై ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ ఉంటుందన్నారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, షకీల్, అశోక్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, ఉయిక ఇందిరా పాల్గొన్నారు.

‘చోరీతో సంబంధం లేదు’

బోథ్: సోనాల పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డు వద్ద మిషన్ భగీరథ వాల్వ్‌ల చోరీతో తమకెలాంటి సంబంధం లేదని పంచాయతీ కార్మికులు పేర్కొన్నారు. చోరీ ఘటనపై సంబంధిత అధికారి ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, తమపై నేరం మోపే ప్రయత్నాలు చేస్తున్నారని పోలీస్‌స్టేషన్ వద్ద పంచాయతీ కార్మికులు, దళిత సంఘాలు సోమవారం ఆందోళన చేపట్టారు. కాగా, సీఐ భీమేష్ వారితో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: దుబార్‌పేట్‌లో సోమవారం పీవీటీజీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ చాహకటి రవి ప్రారంభించారు. గ్రామపటేల్ కాత్లె రాము, సలాంరావు, వార్డు సభ్యులు మాడావి గంగాధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

బోథ్: మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌కాలనీకి చెందిన అవునూరి కార్తీక్ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బోథ్‌కు చెందిన సామాజిక సేవకుడు మీర్ ఇర్షద్ అలీ రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

బైక్‌లకు ఉచిత సర్వీసింగ్

ఉట్నూర్‌రూరల్: ఎస్బీఐ (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ) ఆర్‌సెటీ ఆధ్వర్యంలో గత 29 రోజుల నుంచి 25 మంది అభ్యర్థులకు టూవీలర్ మెకానిక్ ఉచిత శిక్షణ అందించినట్లు డైరెక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో అభ్యర్థులు మంగళవారం బైక్‌లకు ఉచిత సర్వీసింగ్ చేశారు.

జాతరకు రావాలని ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ గ్రామంలో నేటి నుంచి ప్రారంభం కానున్న హరహర మహాదేవ్ దేవస్థానం మహా జాతరకు హాజరు కావాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌కు ఆలయ చైర్మన్ రవీందర్ ఆహ్వానపత్రం అందించారు. జాతరలో క్రికెట్, కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తిరుమలేశుని సేవలో మర్లపల్లి గ్రామస్తులు

బోథ్: మండలంలోని మర్లపల్లి గ్రామస్తులు తిరుమలలోని శ్రీవారిసేవకు వెళ్లారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా అక్కడ నిర్వహించిన కోటి హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమంలో వీరికి అవకాశం లభించింది. కాగా మరో పదిరోజులు శ్రీవారిసేవలో ఉండనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా కార్మికుల నూతక కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అక్నూర్ సంతోష్, భౌనే విలాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

పరామర్శ

జైనథ్: మండలంలోని ఆకుర్ల గ్రామానికి చెందిన రమేశ్ భార్య అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం పరామర్శించారు. దివాకర్ రావ్, సర్దార్, గౌరీ విఠల్ తదితరులు ఉన్నారు.

తాంసి: హస్నాపూర్ గ్రామానికి చెందిన చింతల పెల్లి రవీందర్‌రెడ్డి అనారోగ్యంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. సర్పంచ్ నర్సింగ్ ఉన్నారు.

రేపు రామాలయంలో కీర్తన

ఇచ్చోడ: మండలంలోని పట్వారిగూడ రామాలయంలో గురువారం కీర్తన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విఠల్ మహారాజ్ సాండుల్కర్ పుణ్యతిథిని పురస్కరించుకొని వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ మహారాజ్ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కీర్తన ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదిక

ఇచ్చోడ: మండలకేంద్రంలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారవేదిక నిర్వహించనున్నట్లు డీఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏఈ రాజు పాల్గొన్నారు.

రైతుల పడిగాపులు



తాంసి పోస్టాఫీస్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

తాంసి: పత్తి పంటను జిల్లాలో సీసీఐకి విక్రయించిన రైతులు డబ్బుల కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. వారి బ్యాంక్, పోస్టాఫీస్ ఖాతాల్లో నగదు జమ అవుతున్నాయి. బ్యాంక్‌లో నగదును నేరుగా విత్ డ్రా చేసుకుంటున్నారు. పోస్టాఫీస్ ఖాతాల్లో జమవుతున్న నగదు విత్‌డ్రా చేసేందుకు రైతులు నిరీక్షించాల్సి వస్తోంది. పోస్టాఫీసులో నగదు లేకపోవడమే ఇందుకు కారణం. తాంసి పోస్టాఫీస్ కార్యాలయం వద్ద తాంసి, భీంపూర్, తలమడుగు మండలాలకు చెందిన పలువురు రైతులు గంటల తరబడి ఉంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నవారికి సాయంత్రం నగదు అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899